హరోం హర



మనుబోలు: ప్రత్యేకాలంకరణలో విశ్వనాథుడు



పొదలకూరు: శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

• వైభవంగా కార్తీక పౌర్ణమి పూజలు

పొదలకూరు: పట్టణంలోని కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి పూజలు శుక్రవారం వైభవంగా జరిగాయి. మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలను వెలిగించారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లి, విరువూరు, ఇనుకుర్తి, ప్రభగిరిపట్నం గ్రామ శివాలయాల్లో పూజలు జరిగాయి. ప్రధాన అర్చకుడు ప్రసాద్ స్వామి, కుమారస్వామి పూజలు నిర్వహించారు. పట్టణంలోని విజేత స్కూల్లో కరస్పాడెంట్ జి.కామాక్షి విద్యార్థులకు కార్తీక పౌర్ణమి విశిష్టత గురించి వివరించారు. టీచర్లు పాల్గొన్నారు.

⇨ మనుబోలు: మండలంలోని మనుబోలు శివాలయం, సంగమేశ్వరాలయాలతోపాటు, బద్దెవోలు, పిడూరుపాళెం, వెంకన్నపాళెం, కొలనకుదురు, పిడూరు, మడమనూరు, చెర్లోపల్లి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో శుక్రవారం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. యాచవరం గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు ఆలూరు రాము లవంగంపై సూక్ష్మ శివలింగాన్ని రూపొందించాడు. విశ్వనాథ స్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అర్చకుడు శ్రీనివాసులు స్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అక్కపల్లి సురేష్, చాముండేశ్వరి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

⇨ ఇందుకూరుపేట: మండలంలోని మైపాడులో కొలువైన ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, పల్లకి సేవ జరిగింది. పల్లిపాడులోని వేణుగోపాలస్వామి ఆలయంలో అభిషేకాలు, జ్వాలతోరణం, పల్లకి సేవ కార్యక్రమాలు జరిగాయి. కొమరికలోని కుంభేశ్వరస్వామి ఆలయలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం జరిగింది.

⇨ మైపాడు తీరంలో భక్తుల కోలాహలం నెలకొంది. పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. మహిళలు ఇసుకతో సైకిత లింగాలు ఏర్పాటు చేసుకుని పూజలు చేశారు. అనంతరం తీరం వెంబడి ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగాలు, భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు మహా శివలింగానికి అభిషేకాలు చేసి తన్మయం చెందారు.



పొదలకూరు పట్టణంలోని పాఠశాలలో..

⇨ మండలంలోని రాముడుపాళెం శివాలయంలో విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నప్రసాద వితరణ జరిగింది. ఉభయదాతలుగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, సోదరుడు శ్రీధర్‌రెడ్డి వ్యవహరించారు.

⇨ ముత్తుకూరు: కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని శివాలయాలు శుక్రవారం రాత్రి కిటకిటలాడాయి. భక్తులు పెద్దసంఖ్యలో దీపాలు వెలిగించారు. కృష్ణపట్నం, బ్రహ్మదేవి, వల్లూరు, పోలంరాజుగుంట, పిడతాపోలూరు, పైనాపురం, ముత్తుకూరులోని మహాశివుడి ఆలయాల్లో పూజా కార్యక్రమాలు జరిగాయి.

⇨ బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలోని కామాక్షితాయి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, నవావరణ పూజలు జరిపించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కనిగిరి రిజర్వాయర్‌లో శివలింగానికి సహస్ర ఘట్టాభిషేక పూజలు భక్తిశ్రద్ధలతో చేశారు.



పొదలకూరు: ప్రత్యేకాలంకరణలో రామలింగేశ్వరుడు



మనుబోలు: దీపాలు వెలిగిస్తున్న మహిళలు



ముత్తుకూరు: సిద్దేశ్వరాలయంలో..



ఇందుకూరుపేట: కొమరికలో గ్రామోత్సవం



ఇందుకూరుపేట: రాముడుపాళెంలో అన్నదానం



ముత్తుకూరు: బ్రహ్మదేవి శివాలయంలో..



బుచ్చిరెడ్డిపాళెం : కనిగిరి రిజర్వాయర్ వద్ద..



బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడలో..

క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



సైడ్ డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్

కొడవలూరు: మండలంలోని గండవరం ఆదర్శ నగర్‌లో నిర్మిస్తున్న పశువుల షెడ్లు, సైడ్ డ్రెయిన్‌లను ఉపాధి హామీ పథకం డైరెక్టర్ వైవీకే షణ్ముఖకుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. ఎన్నార్ఈజీఎస్ పనులు కూలీలకు ఊరటగా నిలుస్తాయన్నారు. లబ్ధిదారులకు కేటాయించిన పని దినాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డ్వామా పీడీ గంగాభవాని, ఏపీడీ మృదుల, ఎంపీడీఓ ఏవీ.సుబ్బారావు, పీఆర్ డీఈఈ మోహన్‌రావు, ఏఈ శ్రీనివాసరావు, ఏపీఓ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకారం

మనుబోలు: మండల కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని మనుబోలు ఎస్సై రాకేష్ కోరారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్ వద్ద దుకాణదారులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో దొంగతనాలు, నేరాలను అరికట్టేందుకు కీలకమైన ప్రదేశాల్లో 25 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. కెమెరాలుంటే ఏదైనా నేరం, దొంగతనం జరిగితే అందుకు కారణమైన వారిని పట్టుకోవడం సులభతరమవుతుందన్నారు. ఇందుకోసం రూ.4.50 లక్షలు ఖర్చవుతుందన్నారు. వ్యాపారులు, దుకాణదారులు సహకారం అందించాలని కోరారు.

మంగళంపాడులో ఉచిత వైద్య శిబిరం

వెంకటాచలం: మండలంలోని తిక్కవరప్పాడు పంచాయతీ మంగళంపాడు గిరిజన కాలనీలో శుక్రవారం జయభారత్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్లు రోగులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మహేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

కొడవలూరు: మండలంలోని కొడవలూరు గ్రంథాలయంలో మాదక ద్రవ్యాలతో అనర్థాలపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ హెచ్ఎం వెంకయ్య మాట్లాడుతూ మాదక ద్రవ్యాలతో జీవితాలు సర్వనాశనమవుతాయని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకుంటే బంగారు భవిష్యత్ ఉంటుందని గుర్తించుకోవాలన్నారు. లైబ్రేరియన్ కె.రాజేశ్వరి మాట్లాడుతూ గ్రంథాలయాలకు రావడం ద్వారా పుస్తకాలు, పత్రికలు చదివి సమాజంలో మంచి పౌరులుగా ఎదుగుతారని స్పష్టం చేశారు.

పుస్తకాలు 'విజ్ఞాన దీపాలు'

బుచ్చిరెడ్డిపాళెం: పుస్తకాలు విజ్ఞాన దీపాలని పుస్తకరత్న అవార్డు గ్రహీత గండికోట సుధీర్‌కుమార్ అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి కె.మంజులత, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

కోవూరు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఉపాధి హామీ పథకం డైరెక్టర్ వైవీకే షణ్ముఖకుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో భాగంగా పడుగుపాడు నేతాజీనగర్‌లో వేసిన సిమెంట్ రోడ్డును పరిశీలించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి వాటిని చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ గంగ భవానీ అధికారులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

విడవలూరు: సాగునీటి సంఘాల ఎన్నికలను సంబంధించి ఓటర్ల జాబితాను సవరించాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం నవీన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలను ఏకగ్రీవం చేసేందుకు అధికార పార్టీ నాయకులతో రెవెన్యూ అధికారులు చేతులు కలిపి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. జాబితాలో అవకతవకలను సరిచేసి సరైన సర్వే నంబర్లు కలిగిన రైతులను గుర్తించి వారికి ఓటు హక్కు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రామచంద్రాపురం సర్పంచ్ కరిపింగారి శీనయ్య, మాజీ సర్పంచ్ వావిల రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం



గ్రామస్తులతో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

• మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: కూటమి ప్రభుత్వంలో సర్వేపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమని, అవినీతి మాత్రం ఘనంగా కనిపిస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని యర్రబల్లి గ్రామంలో శుక్రవారం కాకాణి పర్యటించారు. ఈ సందర్భంగా తనను కలిసిన నాయకులు, కార్యకర్తలతో స్థానికంగా నెలకొన్న సమస్యలపై చర్చించారు. మహిళలు, వితంతువులు తమకు పింఛన్లు రావడం లేదని ఏకరువు పెట్టారు. అధికారులతో మాట్లాడి అర్హులైన వారికి పింఛన్లు మంజూరయ్యేలా కృషి చేస్తానని కాకాణి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏడాదికి రెండు పర్యాయాలు కొత్తగా పెన్షన్లను మంజూరు చేసేవారని గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి కనిపించడం లేదని, టీడీపీ నాయకుల అవినీతికి రైతులు బలవుతున్నట్టు విమర్శించారు. అవినీతిపై పోరాటం కొనసాగిస్తానన్నారు. ఇటీవల వివాహం చేసుకున్న దంపతులను కాకాణి ఆశీర్వదించారు. కార్యక్రమంలో బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, డి.వెంకటరమణారెడ్డి, దశకంఠాద్రిశర్మ, ప్రసాద్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నిమ్మతోటలను పరిశీలించిన డైరెక్టర్

పొదలకూరు: మండలంలోని బిరదవోలు పంచాయతీలో నిమ్మతోటలను ఉపాధి హామీ పథకం డైరెక్టర్ వైవీకే షణ్ముఖకుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. సాగుకు అందజేస్తున్న రాయితీల గురించి అడిగి తెలుసుకున్నారు. డైరెక్టర్ వెంట డ్వామా పీడీ గంగాభవానీ, ఎంపీడీఓ నరసింహారావు, ఎస్క్యూసీఓ సతీష్‌బాబు, ఏపీడీ ప్లాంటేషన్ మృదుల, ఏపీఓ మధుసూదన్ తదితరులున్నారు.



వివరాలు తెలుసుకుంటున్న డైరెక్టర్ తదితరులు

తీరప్రాంతం.. అప్రమత్తత ముఖ్యం



మైపాడు తీరంలో పర్యాటకుల సందడి

• కార్తీక మాసంలో సముద్రస్నానాలకు పోటెత్తుతున్న భక్తులు
• జాగ్రత్తలు పాటించాలంటున్న పోలీసులు

కోవూరు : కార్తీక మాసంలో భక్తులు సముద్రస్నానాలు చేసేందుకు తీరప్రాంతాలకు పోటెత్తుతుంటారు. వనభోజనాలు, విహారయాత్రల పేరుతో సందడి చేస్తుంటారు. కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లోని రామతీర్థం, మైపాడు, కొత్తకోడూరు ప్రాంతాల్లో ఉన్న బీచ్‌లలో పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటోంది. ఇందులో అత్యధికంగా మైపాడు బీచ్‌కు జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి భక్తుల రాక ఉంటుంది.
బీచ్‌లో సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉన్నప్పుడు స్థానిక పోలీసులతో పాటు మెరైన్ పోలీసులు అందుబాటులో ఉండాలి. సరైన జాగ్రత్తలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు లేకుండానే తీర ప్రాంతాల్లో ఆహ్లాదం పొందవచ్చని పోలీసులు చెబుతున్నారు.

అందుబాటులో గజ ఈతగాళ్లు




తీరప్రాంతాల్లో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతాం. పర్యాటకులు సముద్రంలోకి వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం. స్థానికంగా ఉన్న పోలీసులు, రెవెన్యూ, ఫిషరీస్ అధికారుల సమన్వయంతో తీరంలో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– సుధాకర్‌రెడ్డి, సీఐ, కోవూరు

ఇవి పాటించాలి

⇨ కోతకు గురైన సముద్ర తీరానికి వెళ్లకుండా ఉంటే మంచిది.
⇨ జనసంచారం లేని తీరానికి వెళ్తే కొన్ని సందర్భాల్లో ప్రమాదం జరిగే అవకాశం ఎక్కువ.
⇨ లోతైన, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకూడదు. తీరప్రాంత పరిస్థితిని ముందుగానే తెలుసుకోవాలి.
⇨ ఫొటోలు, సెల్ఫీలు తీసుకునే సమయంలో అజాగ్రత్తగా ఉంటే అలల తాకిడికి నీటిలో కొట్టుకుపోయే ప్రమాదం ఉంది.
⇨ బోట్లలో ప్రయాణించే సమయంలో లైఫ్ జాకెట్లు వేసుకోవాలి. తగిన ఆహారం తీసుకోవాలి.
⇨ మద్యం తాగి ఎట్టి పరిస్థితుల్లో సముద్రంలో దిగకూడదు.
⇨ అల్పపీడన ప్రభావం ఉంటే సముద్ర తీరానికి వెళ్లకపోవడం మంచిది.

నేత్రదానం



తిరుపాలయ్య(ఫైల్)

విడవలూరు : మండలంలోని వడ్డిపాళెం గ్రామానికి చెందిన గుంజి తిరుపాలయ్య (70) శుక్రవారం పొలం పనిచేస్తుండగా ఆకస్మికంగా మృతిచెందారు. కుటుంబ సభ్యుల కోరిక మేరకు ఆయన నేత్రాలను మన సేవా సంస్థ వ్యవస్థాపకుడు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి సహకారంతో నెల్లూరులోని మోడరన్ ఐ హాస్పిటల్‌కు దానం చేశారు. ఐ టెక్నీషియన్ వేణు, వెంకటేష్ దాత కార్నియాలను సేకరించారు.

పరీక్షలకు 386 మంది గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శుక్రవారం నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలకు 386 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. 5,827 మంది విద్యార్థులకు గానూ 5,441 మంది హాజరైనట్లు వెల్లడించారు.

అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు చర్యలు

కొడవలూరు: పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు పటిష్టంగా రూపొందించాలని ఎంపీడీఓ ఏవీ సుబ్బారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులకు శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థాయిలో అన్ని శాఖల అధికారులతో చర్చించి అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు డి.సురేష్‌కుమార్, మనోహర్ రిసోర్స్ పర్సన్‌లుగా వ్యవహరించారు. ఈఓపీఆర్డీ సాయిప్రసాద్ పర్యవేక్షించారు.

⇨ బుచ్చిరెడ్డిపాళెం : గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై బుచ్చిరెడ్డిపాళెం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండలాధికారులకు శుక్రవారం శిక్షణా కార్యక్రమం జరిగింది. 15వ ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులు, జల్‌జీవన్ మిషన్ నిధులు, ఉపాధి నిధులు, ఇతర ప్రభుత్వ విభాగాల ద్వారా వచ్చే నిధులను కలిపి ప్రణాళిక తయారు చేయాలని ఎంపీడీఓ శ్రీహరి సూచించారు. కార్యక్రమంలో ఏఓ సురేంద్రరెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

⇨ కోవూరు : గ్రామాల్లో ప్రజలకు అవసరమైన పనులు గుర్తించాలని ప్రత్యేకాధికారి రమేష్ అన్నారు. కోవూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో అభివృద్ధి ప్రణాళికలపై శుక్రవారం జరిగిన శిక్షణలో ఆయన పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి పాల్గొన్నారు.

చీరలు, దుప్పట్ల పంపిణీ



కొడవలూరు: బిర్సా ముండా జయంతి సందర్భంగా మండలంలోని యల్లాయపాళెం తెల్లమిట్ట గిరిజన కాలనీలో బీజేపీ గిరిజన మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాట్లూరి శ్రీనివాసులు హాజరై, మాట్లాడారు. బిర్సా ముండా జీవితం గిరిజనుల పోరాట పటిమకు నిదర్శనమని, ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. చలంచర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు మురళీకృష్ణ, పార్టీ నేతలు మాల్యాద్రి, పి.వి జయలక్ష్మి, దాసరి శరవణ, ఏలూరు బుజ్జయ్య, కత్తి మణి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నివారించాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మనుబోలు: బాల్య వివాహాలను పూర్తిగా నివారించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. మండలంలోని పిడూరుపాళెం గ్రామంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయసులో ఆడపిల్లలకు పెళ్లి చేస్తే శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. బాల్య వివాహం చేస్తే చట్ట ప్రకారం రెండేళ్ల కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ గేయ పూజిత, వైద్య సిబ్బంది పోలమ్మ, పూర్ణిమ, ఇంద్రసేన, రమ, అంగన్‌వాడీలు సుబ్బమ్మ, మహిళా పోలీస్ సునీత తదితరులు పాల్గొన్నారు.

కామాక్షితాయి సేవలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని భారత రక్షణ మంత్రిత్వశాఖ శాస్త్రీయ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలోని గణపతి, వల్లీదేవసేన, సుబ్రహ్మణ్యేశ్వరస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు అతిథిని శేషవస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సతీష్‌రెడ్డికి తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఆలయ సిబ్బంది

సచివాలయ భవనం మార్పు

తోటపల్లిగూడూరు: మండలంలోని మేజర్ పంచాయతీ అయిన కోడూరు – 1 సచివాలయ సేవలు ఇప్పటి వరకు కొత్తకోడూరులోని ఓ భవనంలో అందేవి. అయితే దాని పరిధిలోని మజారా గ్రామాలకు ప్రస్తుత సచివాలయం భవనం దూరంగా ఉందని సమీపానికి మార్చాలంటూ స్థానికులు ఎమ్మెల్యే సోమిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సచివాలయాన్ని అధికారులు శుక్రవారం మహాలక్ష్మీపురంలోని ఓ ప్రైవేట్ భవనంలో ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, స్థానికులు వీరబోయిన గంగాధర్, బైనబోయిన శ్రీనివాసులు, ఆవుల మునిరత్నం, పామంజి దొరబాబు, ఊటుకూరు అవినాష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



సచివాలయంలో అధికారులు, నాయకులు

108 సేవలను ప్రభుత్వమే నిర్వహించాలి

ముత్తుకూరు: 108 అంబులెన్స్ సేవలను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని ముత్తుకూరు ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ బాలకృష్ణారెడ్డికి శుక్రవారం ఒక వినతిపత్రం అందజేశారు. అధికారులిచ్చిన హామీ మేరకు స్లాబు విధానం ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. ఎప్పటికప్పుడు స్లాబ్‌లను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. వైద్యారోగ్య శాఖలోని ఈఎంటీ పోస్టుల్లో 108 ఈఎంటీలను నియమించాలని కోరారు. 8 గంటల పని విధానం అమలు చేయాలన్నారు. సహజ మరణం, ప్రమాదాల్లో చనిపోతే ఆ కుటుంబాలకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే నవంబరు 25 తేదీ తర్వాత సమ్మె చేస్తామని హెచ్చరించారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న 108 ఉద్యోగులు

ఆగని వాన

ముత్తుకూరు: సముద్రతీర ప్రాంతమైన ముత్తుకూరు మండలంలో గురువారం రాత్రి కూడా ఉరుములు, మెరుపులతో జోరు వాన కురిసింది. శుక్రవారం ఉదయానికి 45.6 మి.మీ వర్షపాతం నమోదైంది. విస్తారంగా వర్షాలు కురవడంతో మండలంలో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి.

స్తంభించిన జనజీవనం

తోటపల్లిగూడూరు: మండలంలో శుక్రవారం కూడా వర్షాలు కురిశాయి. దీంతో జనజీవనం స్తంభించింది. కోడూరు, వెంకన్నపాళెం, కాటేపల్లి తీరాల్లో భారీ వర్షాలకు తోడు చలిగాలులు వీయడంతో తీరప్రాంతవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మత్స్యకారులు వేటను నిలిపేశారు. లోతట్టు ప్రాంతాల్లో అధికారులు సహాయ చర్యలను చేపట్టేందుకు సిద్ధమయ్యారు. వర్షాలతో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి.



బురదమయమైన నరుకూరు సెంటర్‌లో ప్రధాన రహదారి



మండపం గ్రామం ప్రధాన రహదారి ఇలా..